బాబు వచ్చె... కడుపు కొట్టె

- వలంటీర్ల వ్యవస్థకు మంగళం
- ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగుల తొలగింపు
- ఎండీయూ, ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న బాధితులు



అవుకు: ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని పెద్ద పెద్ద హామీలు ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వడం అటుంచితే.. ఇప్పటికే ఉన్న చిరుద్యోగులను కూడా తొలగించి, వేలాది మందిని రోడ్డునపెట్టారు. వారికి ఉపాధిని దూరం చేసి కొడుపుకొట్టారు.

వలంటీర్లకు గుడ్‌బై

ప్రజల ఇంటి ముంగిటకే సేవలు అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. దీని కోసం వేలాది నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. అయితే, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వలంటీర్లను తొలగిస్తూ వ్యవస్థనే రద్దు చేసింది. బనగానపల్లె నియోజకవర్గంలో 1,722 మంది వలంటీర్లు ఉద్యోగాలు కోల్పోయారు. ఎన్నికల సమయంలో నెలకు రూ.10వేలు జీతం ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, చివరికి ఉద్యోగమే తీసేసింది. ఉపాధి కోల్పోయిన వారు ప్రైవేటు పనులకోసం తలదించుకుని తిరుగుతున్నారు.

మద్యం పాలసీతో ఉద్యోగులకు ఎసరు

గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. ఈ దుకాణాల్లో యువతకు ఉద్యోగాలు కల్పించింది. నియోజకవర్గంలోని 22 మద్యం షాపుల్లో 110 మంది ఉద్యోగాలు చేసేవారు. అయితే మద్యం అమ్మకాలు పెంచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తెచ్చి షాపులను ప్రైవేటుకు అప్పగించడంతో వారంతా పనిలేక సతమతమవుతున్నారు. ప్రస్తుతం వారు కూలీలుగా మారారు.

ఎండీయూలకు బ్రేక్

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ అందించేందుకు తీసుకొచ్చిన ఎండీయూ వాహనాలను కూడా కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దాంతో వాటిపై ఆధారపడ్డ డ్రైవర్లు, ఆపరేటర్లు ఉపాధి కోల్పోయారు.

బనగానపల్లె నియోజకవర్గంలో ఇలా..

మండలం	వలంటీర్లు	ఎండీయూ ఆపరేటర్లు	మద్యం దుకాణాల్లో ఉద్యోగులు	ఫీల్డ్ అసిస్టెంట్లు
అవుకు	270	10	10	18
కొలిమిగుండ్ల	220	10	15	23
సంజామల	92	08	25	17
బనగానపల్లె	598	19	35	24
కోవెలకుంట్ల	277	09	25	17

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఊహించని షాక్

ఉపాధి హామీ పథకం కింద ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లుగా పనిచేస్తున్నవారిని వివిధ రాజకీయ కారణాలతో తొలగించారు. చాలా మంది ఏళ్ల తరబడి పనిచేస్తూ జీవనం సాగిస్తున్న వారు ఒక్కసారిగా ఉ పాధి లేక కుటుంబాలతోపాటు రోడ్డున పడ్డారు. త మకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది.

ఇది నమ్మక ద్రోహమే



అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని, నెలకు రూ.10వేలు జీతం ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నమ్మబలికారు. అధికారంలోకి రాగానే చిరుద్యోగులైన వలంటీర్లపై కూటమి ప్రభుత్వం తన ప్రతాపాన్ని చూపింది. ఉద్యోగాల నుంచి తొలగించింది. ఇది పూర్తిగా నమ్మక ద్రోహమే.

–కరిముల్లా, అవుకు

ప్రజల్లో ఆగ్రహం

కూటమి ఏడాది పాలనలో ఉద్యోగాల తొలగింపు, అరాచక చర్యలతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉద్యోగ భద్రత కల్పిస్తామని నమ్మించి, చివరికి ఉద్యోగాలే తీసేసారు. ఇదెక్కడి న్యాయం అంటూ బాధితులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత ఏదీ?



ఎండీయూ వాహనాల ద్వారానే జీవిస్తున్నాం. అకస్మాత్తుగా కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను నిలిపివేసింది. దాని ఆధారంగా ఉన్న ఉద్యోగం ఊడిపోయింది. ఇప్పుడు ఎలా బతకాలి. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. వాహనాలకు బ్యాంకుల రుణం తాలూకు ఈఎంఐలు కూడా ఉండడం వల్ల వాటిని చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాం.

–కేశవులు, గుండ్లశింగవరం, అవుకు

అధికారంలోకి రాగానే తొలగింపు



ఉపాధి హామీ పథకంలో ఐదేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేశా. అధికారంలోకి రాగానే కూటమి నేతలు ఫీల్డ్ అసిస్టెంట్‌గా నన్ను తొలగించాలని ప్రయత్నం చేశారు. ఏవేవో కారణాలు చూపుతూ రిజైన్ చేయాలని ఎంపీడీఓతో నోటీసు ఇచ్చారు. అభాండాలు మోపి నన్ను తొలగించారు.

–రామగోవిందు, సుంకేసుల

ప్రత్నామ్నాయం చూపకనే తొలగింపు



గత ప్రభుత్వం తమిళనాడు తరహాలో ఇక్కడి మద్యం షాపులను కూడా ప్రభుత్వమే నిర్వహించేలా మార్చి మా లాంటి ఎంతో మందికి ఉద్యోగాలిచ్చి ఆదుకుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మమ్మల్ని తొలగించి వీధిన పడేసింది. ప్రత్యామ్నాయం చూపకుండా చిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంది.

–సుధాకర్ రెడ్డి, ఆకుమళ్ల, సంజామల

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కోవెలకుంట్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో బెర్రీస్, సపోటా, నేరేడు, సీతాఫలం, తదితర పండ్ల, పూల మొక్కలు నాటారు. అడవులు అంతరించిపోతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, లక్ష్మిదేవి, భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, నరేంద్రనాథరెడ్డి, కృష్ణశశాంక, కృష్ణదాసు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేద్దాం

బనగానపల్లెరూరల్: ఈ నెల 15న బనగానపల్లెలో నిర్వహించ తలపెట్టిన సీపీఐ 7వ మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య కోరారు. గురువారం స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో సీపీఐ నాయకుల సమావేశం జరిగింది. మహాసభలకు నియోజవర్గంలోని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు, రైతులు పాల్గొనాలన్నారు.

విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు కృషి

కొలిమిగుండ్ల: విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చేందుకు మంత్రి లోకేష్ విద్యాశాఖ తీసుకున్నారన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి బాగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం అమలు చేసిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాపిలి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ప్యాపిలి టౌన్‌తో పాటు వెంగళాంపల్లి, ఎన్. రంగాపురం, వెంకటాంపల్లి, పెద్దపొదిళ్ల, చిన్నపొదిళ్ల, ఓబులదేవరపల్లి, కలచట్ల, ఎస్ రంగాపురం, ఎర్రగుంట్లపల్లి, నల్లబల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఇచ్చే 3 ఫేస్ కరెంట్ ఉదయం 3 గంటల నుంచి 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సరఫరా చేస్తామన్నారు.

ప్రశాంతంగా సీఎస్ఐ సంఘం ఎన్నికలు

కోవెలకుంట్ల: స్థానిక సీఎస్ఐ చర్చి సంఘం సభ్యుల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. కోగిల విశ్వనాథ్, పెరుమాళ్ల రత్న మయ్య ప్యానళ్లకు సంబంధించి చర్చి ఫాస్టర్ ఐజక్ రాజు ఆధ్వర్యంలో పోలింగ్ నిర్వహించ గా 300 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో ఆయా ప్యానళ్లకు సంబంధించి కోగిల విశ్వనాథ్, నేస వినోద్‌కుమార్, పెరుమాళ్ల రత్నమయ్య, శ్రీరాముల సుధీర్, కోగిల లలితమ్మ, మాలే ప్రమీల, మారెం స్వప్న విజయం సాధించారు. యూత్ సభ్యులుగా నాగవర్ధన్, రవి, అభినయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణంలోని చాకలివీధిలో పేకాట ఆడుతున్న వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి వారి వద్ద నుంచి రూ. 8 వేలు నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బేతంచెర్ల: ముద్దవరం సమీపంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. దాడుల్లో సంజామల, ఆళ్లగడ్డ మండలాలకు చెందిన ముగ్గురు పేకాట రాయుళ్ల ను అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ. 22,500 నగదుతో పాటు 22 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. 2 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. మరి కొందరు పరారైనట్లు చెప్పారు.

మొక్కుబడిగా తల్లిదండ్రుల సమావేశం

బనగానపల్లెరూరల్/బేతంచెర్ల/ప్యాపిలి: డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో గురువారం జరిగిన ప్యారెంట్స్ మీటింగ్ మొక్కుబడిగా సాగింది. బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో పాటు ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎన్జీవో కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగరాజు పాల్గొన్నారు. బేతంచెర్ల గోరుమానుకొండ మోడల్ స్కూల్, బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కేజీబీవీలో జరిగిన సమావేశాల్లో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, తహసీల్దార్ నాగమణి, ఎంఈఓ సోమశేఖర్ పాల్గొన్నారు. ప్యాపిలి మండలం పోతుదొడ్డి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మీటింగ్‌లో సర్పంచ్ రంగమ్మ, హెచ్ఎం అరుణ మాట్లాడారు.

రెప్పపాటు నిర్లక్ష్యం జీవితాన్ని బలిచేస్తుంది



మాట్లాడుతున్న ఎంవీఐ క్రాంతికుమార్

డోన్: మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా అద్భుతంగా రాణిస్తున్నారని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) క్రాంతికుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సాయిశ్రీ డిగ్రీ కళాశాలలో ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు శకుంతలారెడ్డి అధ్యక్షతన 'రోడ్డు ప్రమాదాలు–భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. మహిళలు ద్విచక్ర వాహనాలను విస్తృతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని వివరించారు. రెప్పపాటు నిర్లక్ష్యం జీవితాన్ని అర్ధాంతరంగా ముగిస్తుందని, కుటుంబ పెద్దను కోల్పోతే తీరని నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ సుమిత్ర రాజేష్, క్లబ్ కార్యదర్శులు జయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జడ్జి ప్రతిమ

బనగానపల్లె రూరల్: మండల న్యాయసేవా అధికారి జడ్జి ప్రతిమ ఆధ్వర్యంలో గురువారం బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయసేవా సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆమె తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మీడియేషన్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు త్వరగా, తక్కువ ఖర్చుతో పరిష్కారం అవుతాయని, అప్పీలు చేసే అవకాశం ఉండదని వివరించారు. ఇది సివిల్ ప్రొసిజర్ కోడ్‌లోని సెక్షన్ 89 కింద ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గంగా గుర్తించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బనగానపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా హుస్సేన్, శిక్షణ పొందిన న్యాయవాదులు జగన్నాథ్ రెడ్డి, అజాం హుస్సేన్, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మామిళ్లపల్లిలో పట్టపగలే చోరీ



పగులగొట్టిన బీరువా లాకర్

ప్యాపిలి: జలదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రామాంజనేయులు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువా తాళాలు, లాకర్ తాళాలు పగులగొట్టి రూ.30 వేలు నగదుతో పాటు బంగారు నగలు చోరీ చేశారు. చోరీకి గురైన వస్తువుల విలువ రూ. 4 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు జలదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రెజరీ బిల్లుల విషయంలో అలసత్వం తగదు



ట్రెజరీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న అధికారిణి లక్ష్మిదేవి

డోన్: వివిధ పద్దుల కింద చెల్లించాల్సిన వేతనాలు, బకాయిలు వంటి ట్రెజరీ బిల్లుల విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా ఖజానా ముఖ్య అధికారిణి లక్ష్మిదేవి అధికారులను హెచ్చరించారు. డోన్ ట్రెజరీ కార్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, ట్రెజరీ బిల్లుల రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపక ఖజానా అధికారి సునీల్‌కుమార్‌కు సూచించారు.

గ్రామంలోనే 104 సేవలు

సాక్షి ఎఫెక్ట్



సుంకేసుల సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన 104 వైద్య సేవలు

అవుకు: మండలంలోని సుంకేసుల గ్రామంలో 104 వాహన వైద్య సేవలను మళ్లీ గ్రామ సచివాలయం వద్దకే చేర్చారు. కొద్ది రోజులుగా ఈ వాహనం గ్రామానికి సుమారు 500 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో "అంతా మా ఇష్టం" శీర్షికలో ఈ నెల 2న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి జిల్లా వైద్యాధికారులు స్పందించి 104 సేవలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గురువారం నుంచి 104 వాహనాన్ని మళ్లీ గ్రామ సచివాలయం వద్దనే ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారానికి దోహదపడిన సాక్షి దినపత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన జియారత్ వేడుకలు



పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో దస్తగిరిస్వామి, మౌలాలిస్వామి జియారత్ వేడుకలు గురువారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి గ్రామంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ఆయా వీధుల మీదుగా పీర్ల ఊరేగింపు సాగింది. భక్తులు స్వామి వార్లకు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను చావిళ్లలో కొలువుంచడంతో జియారత్ వేడుకలు ముగిశాయి. వేడుకలను తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, అనంతపురం జిల్లా తాడిపత్రి, తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆరోగ్య ప్రదాయిని నమోస్తుతే



శాకంబరి అలంకరణ చేసి పూజలు చేస్తున్న వేదపండితులు

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని మహాలక్ష్మి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, వేదపండితులు కళ్యాణ చక్రవర్తి, జ్వాలా చక్రవర్తిల సమక్షంలో ప్రత్యేక పూజలు జరిగాయి. దాతలు అందజేసిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి, వేదమంత్రోచ్చారణ మధ్య 1008 పూర్ణములతో మహాలక్ష్మి సహస్రనామ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీమహాలక్ష్మీ నమోస్తుతే.. జగన్మాతై నమోస్తుతే అంటూ భక్తులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి అష్టవిధ మహామంగళహారతులు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

సంజామల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని నంద్యాల డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. ముక్కమల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఎంఈఓ ఈశ్వరయ్యతో కలిసి మొక్కలు నాటారు. ముక్కమల్ల యూపీ పాఠశాల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతపై సర్వే

కోవెలకుంట్ల: రేవనూరులో పరిసరాల పరిశుభ్రతపై గురువారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ బృందం సర్వే నిర్వహించింది. సర్పంచ్ సరస్వతమ్మ, ఎస్ఎస్‌జీ జిల్లా కన్సల్టెంట్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గ్రామంలో పర్యటించింది. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, చేతులను శుభ్రపరుచుకోవడం, పారిశుద్ధ్య నివారణ, తడిచెత్త, పొడిచెత్త సేకరణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సర్వే ద్వారా గ్రామ పంచాయతీలకు జిల్లా, మండల, గ్రామస్థాయి ర్యాంకులు కేటాయిస్తామన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.

యోగా గురువుకు సన్మానం



సన్మానం అందుకున్న నాగేశ్వరరావు

కోవెలకుంట్ల: స్థానిక రోటరీక్లబ్ భవనంలో గురువారం యోగా గురువు నాగేశ్వరరావుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. శిష్యులకు జ్ఞాన మార్గాన్ని, సమాజ శ్రేయస్సుకు జీవించే విధానాన్ని గురువు బోధిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ సమాజంలో పరోపకారం కోసం బద్ధులై ఉండి నీతీ నిజాయితీతో ఇతరులకు సత్యాన్ని, ప్రేమను అందించాలని సూచించారు. యోగా శిష్యులు వెంకటసుబ్బయ్య, ధరణికుమార్, సురేష్, లోకేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం విరాళం



సౌండ్‌బాక్సును అందజేస్తున్న దాత సజ్జు

డోన్: మండలంలోని యు.కొత్తపల్లె ఉన్నత పాఠశాలకు రూ.80వేల విలువైన సౌండ్ సిస్టం బాక్సును వైట్ ఫీల్డ్ మినరల్స్ యజమాని సజ్జు గురువారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, గ్రామపెద్దలు దాతను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ కక్షతో అభివృద్ధిని అడ్డుకోవడం తగదు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన, మాజీ ఎమ్మెల్యే కాటసాని తదితరులు

- మాజీ మంత్రి బుగ్గన ధ్వజం

డోన్ టౌన్: రాజకీయ కక్షతో అభివృద్ధి పనులను అడ్డుకుంటే ప్రజలు సహించరని.. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత ప్రయోజనాలు చూసుకుంటే ఏ రాజకీయ నాయకునికి భవిష్యత్ ఉండదని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. డోన్ నడిబొడ్డున ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శివారు ప్రాంతానికి తరలించడంపై అసహనం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పట్టణ నడిబొడ్డున ఉన్న నూతన భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మారుస్తామని హామీ ఇచ్చారు. కూటమి నాయకులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఆదాయం కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ యాప్‌ను విడుదల చేశారు. సమావేశం అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాలరెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డితో కలిసి పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.

చారిత్రాత్మిక తప్పిదం

కోట్ల రుపాయాల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన భవనాలను వ్యక్తిగత కక్షలతో నిరుపయోగంగా ఉంచడం చారిత్రాత్మక తప్పిదమని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు రూ. 6కోట్లతో నిర్మించిన క్లబ్ హౌస్, డ్రైవర్ల శిక్షణా కేంద్రం తదితర వాటిని పూర్తి చేయకపోవడం తగదన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని 35 చెరువులకు హంద్రీ–నీవా కాలువ ద్వారా నీళ్లు వదిలితే ఈ ఏడాది చెరువులకు చుక్క నీరు వదలకపోవడం విచారకరం అన్నారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్‌యాదవ్, మల్లికార్జునరెడ్డి, నాయకులు పిట్టల జాకీర్, తిరుమలేశ్వర్ రెడ్డి, పోదొడ్డి కృష్ణమూర్తి, తిరుమలరెడ్డి, రాము, ఆలేబాదు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



డోన్‌లో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు



బనగానపల్లె సాయిబాబా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా పట్టణాలు, గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కాగడ హారతి, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అర్చనలు, హోమాలు, మంగళహారతులు, పల్లకీసేవలు జరిగాయి. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆయా చోట్ల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బనగానపల్లె అవుకురోడ్డులోని షిర్డీసాయిబాబా ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కొలిమిగుండ్లలోని ఆలయాన్ని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి దర్శించుకున్నారు. –సాక్షి నెట్‌వర్క్



కొలిమిగుండ్ల: యర్రగుడి బాబా ఆలయం



బేతంచెర్లలో..

రైల్వే కనెక్టివిటీకి సహకరించండి



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి. చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల మీదుగా తాడిపత్రి వరకు రైల్వే కనెక్టివిటీ కోసం సహకరించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లారు జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి. గురువారం కొలిమిగుండ్లలో షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గురుపౌర్ణమి వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. రైల్వే కనెక్టివిటీ విషయంపై పార్లమెంట్‌లో చర్చిస్తామని తెలిపారు. జాతీయ రహదారి పనులు నంద్యాల జిల్లా నుంచి త్వరలోనే మొదలవుతాయన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీఓ సాల్మాన్ తదితరులు పాల్గొన్నారు.